
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
*** మంగళవారం 15 అక్టోబరు 2024 5



జీవనది.. కాలకూటవిషంలా
మూసీనది

కాలకూటవిషంగా మారిన మూసీనది జలాల ప్రక్షాళన చుట్టూ రాజకీయం సాగుతోంది. 20 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రతీ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్నా, ఈ ప్రాజెక్టు ముందుకుసాగడం లేదు. రాజకీయ ఉద్దేశాలేవైనా మూసీ ప్రక్షాళన అవశ్యమని ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం కోరుతోంది. హైదరాబాద్ మహానగర మురుగునీరు, మూసీనది వెంట ఏర్పాటు చేసిన పారిశ్రామికవాడల నుంచి వచ్చే వ్యర్థరసాయనాలతో మూసీ విషతుల్యంగా మారింది. ఈ నీరు ప్రవహించే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూములు కాలుష్యపూరితం కాగా, ఇక్కడ పండే పంటల్లో కూడా వాటి అవశేషాలు ఉండటంతోపాటు, ఈ నీటిని తాగిని వారికి ప్రాణాంతక రోగాలు సోకుతున్నాయి. నీటిని తాగిన పశువులు సైతం రోగాలబారిన పడుతున్నాయి. తాజాగా మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టడంతో మూసీపరివాహకం ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈసారైనా మూసీకి పట్టిన కాలుష్యపీడ విరగడవుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మూసీ నది కాలుష్యంతో ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలు, ప్రజలు, జీవాలపై ప్రభావం, తదితర ఇక్కట్లపై నేటి నుంచి వరుస కథనాలు..

ఆంధ్రజ్యోతి మూసీ మురిసేనా 1



విషతుల్యంగా ఉప్ప నీరు

- ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక పరివాహకం ఉన్నా, నీటిని వినియోగించలేని దుస్థితి
- నిత్యం 2,877 మిలియన్ల లీటర్ల కాలుష్యనీరు మూసీలోకి
- పరిశ్రమల వ్యర్థాలు, మహానగర మురుగుతో మూసీ విషతుల్యం

నల్లగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో ఉద్భవించిన మూసీ నది నల్లగొండ జిల్లాలోని వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసేంతవరకు 267కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ప్రస్తుతం యాదాద్రి జిల్లాలోని బీబీనగర్ మండలం మక్త అనంతారం వద్ద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రవేశించి 180కిలోమీటర్ల మేర ప్రవహించి వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, సూర్యాపేట, హుజూర్‌నగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో ఈ నది ఆధారంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ నదీజలాల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 24 వరకు కత్వలు ఉండగా, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ, బునాదిగానికాల్వ, అసిఫ్‌నహర్‌కాల్వ వంటి పలు కాల్వలకు నేరుగా సాగునీటిని అందిస్తుండగా, సుమారు 40వరకు గొలుసుకట్టు చెరువులకు నీరందుతోంది. దిగువన సోలిపేట వద్ద 4.60 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మూసీ ప్రాజెక్టు నుంచి సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని 31వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇటీవల చేపట్టిన ఆధునికీకరణ పనుల తర్వాత ఈ ఆయకట్టు 40వేల ఎకరాలకు చేరింది.

2,877 ఎంఎల్‌డీ కలుషిత నీరు

గ్రేటర్ హైదరాబాద్ నుంచి వచ్చే మురికినీరు, మూసీపరివాహక ప్రాంతాలైన కాటేదాన్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కూకట్‌పల్లి, సనత్‌నగర్

మిగతా 6వ పేజీలో...



కలుషిత జలాలతో
కష్టాలు పడుతున్నం

మూసీ జలాలతో భూగర్భజలాలు కలుషితం కావడంతోపాటు ఆక్సీజన్ శాతం తగ్గిపోతున్నది. దీంతో చేపలు, వృక్ష, జంతు ఆనవాళ్లు కనిపించకుండాపోతున్నాయి. మూసీ ఆయకట్టులోని 55 చెరువులపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారుల జీవితాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మూసీ ఆయకట్టులో సుమారు లక్ష ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఈ నీటితో పండే పంటలు సైతం హానికరంగా మారుతున్నాయి. కలుషిత మూసీ నీరు కారణంగా తాటిచెట్లు దెబ్బతింటున్నాయి. దీంతో కల్లు కూడా కలుషితమవుతోంది. పశువులు చర్మవ్యాధులకు గురవుతున్నాయి. ప్రజలు మూత్రపిండాలు, క్యాన్సర్ లాంటి వ్యాధులబారిన పడుతున్నారు. వరి సేద్యం బహు భారంగా మారింది. మూసీ కాలుష్య నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టాలి. ఆయకట్టు రైతులను ఆదుకోవాలి.

- కోట రామచంద్రారెడ్డి, రైతు సంఘం యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు

గాలికుంటు నివారణకు టీకాలు

- జిల్లాలో 5లక్షలకు పైగా పశువులు
- నేటి నుంచి వచ్చే నెల 14వరకు టీకాలు



నల్లగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మాతి సూక్ష్మక్రిముల (వైరస్) కారణంగా పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలిచ్చేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గాలికుంటు వ్యాధి వల్ల పశువులకు నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి అనతి కాలంలో ఈ వ్యాధి మిగతా పశులవులకు గాలి ద్వారా వ్యాపిస్తుంది. గాలికుంటువ్యాధి నివారణకు ఏటా పశుసంవర్ధకశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఎఫ్ఎండీ కంట్రోల్ ప్రోగ్రాం కింద జిల్లా వ్యాప్తంగా అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వనున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు టీకాలు ఇచ్చేందుకు పశువైద్యులు సన్నద్ధమయ్యారు.

పశువులకు టీకాలు వేసిన వెంటనే కొమ్ములకు ఆకుపచ్చ రంగు వేస్తారు. దీని ద్వారా ఏ పశువుకు టీకా వేసింది గుర్తించవచ్చు. గ్రామాల్లో ఉదయం వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే ఈ టీకా వేస్తారు. మూడు నెలల వయసు పైబడిన అన్ని పశువులకు టీకాలు ఇస్తారు. జాతీయ గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని పశువుల యజమానులు అంటే రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో మొత్తం 5లక్షలకు పైగా గేదె జాతి పశువులతో పాటు తెల్లజాతి పశువులు ఉన్నాయి. అందులో గేదె జాతి పశువులు 3,17,279 ఉండగా, తెల్లపశువులు 2,15,869 ఉన్నాయి. మొత్తం 78 బృందాల ద్వారా నెల రోజుల పాటు ఈ టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టనున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

- పశువులు ముడుచుకొని పడుకుంటాయి.
- జ్వరం తీవ్రత 105డిగ్రీల ఫారన్‌హీట్‌కు పైగా ఉంటుంది.
- నోరు, నాలుక పైభాగాల్లో పుండ్లు ఉంటాయి.
- మేత మేయకపోవడం, నెమరు వేయకపోవడం, పాలు తగ్గిపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి.
- నోటి నుంచి సొంగ లేదా నురుగు వస్తుంది. దగ్గు కూడా ఉంటుంది.
- గిట్టలమధ్య ఎర్రబడి,మెత్తబడి కుంటుతాయి.
- వ్యాధి సోకిన పశువుల దూడలు 30 నుంచి 40శాతం వరకు చనిపోతాయి.
- చూడి పశువులు ఈడ్చుకపోతాయి.
- రైతులను ఆర్థికంగా నష్టపర్చే వ్యాధుల్లో గాలికుంటు ప్రధానమైనది.
- ముందస్తు టీకాల ద్వారానే ఈ వ్యాధిని దూరం చేయవచ్చు.

good morning Nalgonda

రూ.516కోట్లతో
నల్లగొండకు బైపాస్

- ఎక్స్‌లో వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతిపాదించిన 14 కిలోమీటర్ల నాలుగు లేన్ల బైపాస్ రహదారి నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రహదారి నిర్మాణానికి రూ.516కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్టు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్(ట్విట్టర్)లో సోమవారం రాత్రి పేర్కొన్నారు. నకిరేకల్-నాగార్జునసాగర్ నడుమ ఉన్న 565 జాతీయ రహదారిలో భాగంగా ఈ బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి తాను చేసిన కృషి ఫలించిందని, నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



మగువ ముందడుగు

- ఒడిదొడుగులు ఎదురైనా ఓర్పుతో ముందుకు సాగుతున్న మహిళలు
- కుటుంబాలకు చేదోడు వాదోడు
- కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న మహిళలు

7లో..

దారులన్నీ రాజధాని వైపే

- రెండో రోజూ జాతీయ రహదారిపై తగ్గని వాహనాల రద్దీ

ధాన్యం విక్రయాలపై
రైతుల్లో గుబులు



- సీఎంఆర్‌పై తేలని వ్యవహారం
- బియ్యం శాతం తగ్గించాలంటున్న మిల్లర్లు
- ఈ పంచాయితీ తేలితేనే సజావుగా కొనుగోళ్లు
- గోదాముల్లో 80వేల మెట్రిక్ టన్నుల నిల్వకే చాన్స్
- మిల్‌పాయింట్ల వద్ద కొనుగోళ్లకు నామమాత్రపు ధరే

ధాన్యం విక్రయాలపై రైతుల్లో గుబులు మొదలైంది. సన్నధాన్యం కొనుగోళ్లపై మిల్లర్లు, ప్రభుత్వం మధ్య పంచాయితీ కొనసాగుతుండగా, రైతులకు ఇబ్బందిగా పరిణమించే అవకాశం ఉంది. మిల్లర్లు సీఎంఆర్‌కు అంగీకరించకపోతే, ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఉత్పత్తయ్యే ధాన్యానికి అవసరమైనంత మేర గోదాముల్లో చోటులేదు. సన్నబియ్యం ఎగుమతులకు స్వేచ్ఛాయుతవాతావరణాన్ని కేంద్రం కల్పించినా, భారీగా లాభాలొచ్చే అవకాశాలు దక్కినా, సన్న ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు ఉదారత చూపకుండా, ఆచితూచి వ్యవహరిస్తుండడంతో రైతుల్లో మద్దతు ధరపై అనుమానం వ్యక్తమవుతోంది. మిల్లర్లు, ప్రభుత్వం మధ్య నష్టపోకుండా చూడాలని, ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేందుకు కార్యాచరణ రూపొందించాలని, కొనుగోలు కేంద్రాల్లోనే కాకుండా మిల్‌పాయింట్ల వద్ద కూడా ధరలో స్థిరత్వం ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నల్లగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సీజన్ ఆరంభమైనా, ధాన్యం కొనుగోలుకు అవకాశాలున్నా మిల్లర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. సన్నధాన్యం మిల్లింగ్‌పై ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య కొనసాగుతున్న పట్టువిడుపే ఇందుకు కారణం. సీఎంఆర్ కింద వానాకాలంలో సన్నధాన్యానికి పచ్చిబియ్యమైతే 67కిలోలు, బాయిల్డ్ అయితే 68కిలోలు ఇవ్వలేమని, దీన్ని 60కిలోలకు తగ్గించాలని మిల్లర్లు ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. ఆ మేరకు ప్రభుత్వం నిబంధనలు సడలించకపోతే తాము కింద ధాన్యం తీసుకునేదిలేదని తేల్చిచెప్పడంతో ప్రభుత్వం దీన్ని పరిశీలిస్తోంది. ఈ అంశం తేలకముందే సీజన్ మొదలవడంతో మిల్లర్లు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, నకిరేకల్, మునుగోడు తదితర నియోజకవర్గాల్లో బోరుబావుల కింద సాగైన వరి పంట కోతలు ప్రారంభమై మిల్‌పాయింట్లకు ధాన్యం వస్తోంది. సన్నధాన్యం పండించిన రైతులు మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు నేరుగా ట్రాక్టర్ల ద్వారా తెచ్చి విక్రయిస్తున్నారు. ఇప్పటికే ఎగుమతుల కోసం రంగంసిద్ధం

- మిగతా 8వ పేజీలో...



మహా నైవేద్యం
సమర్పయామి

- యాదాద్రి లక్ష్మీనృసింహస్వామికి నిత్యనైవేద్యాల సమర్పణ
- ప్రత్యేక రోజుల్లో మరింత విశేషంగా..
- లడ్డూ, పులిహోర కోసం భక్తుల ఆసక్తి

6

ఇందిరమ్మ పట్టాల జాబితా సిద్ధం చేయాలి

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల, గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల గుర్తింపు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ఆర్డీవోలు, కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం బాగున్నప్పటికి పట్టణ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారం వేగం పెంచాలన్నారు. ఈ విషయంలో మునిసిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కొండమల్లేపల్లి వంటి గ్రామీణ మండలంలో గత వారం 1000 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని మునిసిపల్, పట్టణ ప్రాంతాలల్లో దరఖాస్తుల పరిష్కారం వేగం పెంచాలన్నారు. 2014కు ముందు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇచ్చి బ్యాంకుల్లో మార్టిగేజ్ ఉండి రిలీజ్ అయిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల లబ్ధిదారుల జాబితాను మండలాలు, గ్రామాల వారీగా శనివారం లోగా తయారు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, మునిసిపాలిటీ, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు పూర్తయిన చోట పారదర్శకంగా లబ్ధిదారుల గుర్తింపు 10రోజుల్లోగా పూర్తి కావాలన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వర్షాలకు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ, చండూరు ఆర్డీవో శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలి

మంగళవారంలోగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పంచాయతీ ప్రత్యేక అధికారి చైర్మన్‌గా, స్వయం సహాయక మహిళా సంఘాల నుంచి ఇద్దరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల నుంచి ముగ్గురు, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శితో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుచేయాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిరవధిక బంద్
- నిరసన తెలిపిన యాజమాన్యాలు



నిరసన తెలుపుతున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు సంఘ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మెండు వెంకట్ రెడ్డి తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని హాసిత కళాశాల ప్రాంగణంలో సోమవారం మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే ఆలోచనతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కళాశాలలను నిర్వహిస్తున్నామన్నారు. అయితే మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అధ్యాపకులకు జీతభత్యాలు అందించడంతో పాటు భవనాల పాటు అద్దె, విద్యుత్ బిల్లుల చెల్లింపులు కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు కళాశాలల యాజమాన్యాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందిని ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసేంత వరకు డిగ్రీ, పీజీ కళాశాలలను నివధికంగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. కాగా పట్టణంలోని విజేత, హాసిత, చైతన్య, శాంతినికేతన్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు నిరవధిక బంద్ పట్ల నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో తెడ్ల ధనుంజయ్, కోల శ్రీను, శ్రీనాథ్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి కళాశాల నిరవధిక బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గత మూడు ఏండ్లుగా ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయక పోవడంతో కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అంతకు ముందు పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాంమోహన్, నర్సింహరెడ్డి, జానయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు
కౌన్సెలింగ్

డైట్‌లో 10గంటలకు ప్రారంభం

నల్లగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎస్సీ 2024లో ఎంపికై నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈనెల 10,11 తేదీల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులందరూ కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. డైట్‌లో కౌన్సిలింగ్ కోసం రెండు హాల్‌లను కేటాయించారు. ఈ కౌన్సిలింగ్ కోసం మొత్తం 24మంది అధికారులను, ఉద్యోగులను, సిబ్బంది నియమించారు. 12 మంది బృందం కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఒకే రోజు ప్రక్రియ పూర్తి అయ్యేలా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. హాజరయ్యే అభ్యర్థులు రెండు లెటెస్ట్ ఫోటోలతో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీలో భాగంగా కొంతమంది ఉపాధ్యాయులు బదిలీ అయి అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వారు 15న సాయంత్రం ఆ పాఠశాల నుంచి విడుదల అవుతారు. 16న బదిలీ అయిన స్థానంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్ ద్వారా ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు వీరి స్థానాల్లో రిపోర్టు చేస్తారు. మొత్తం 535 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి ఆప్షన్ ప్రకారంగా పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

గరిష్ఠ నీటి మట్టానికి అడుగు దూరంలో 'సాగర్'

నాగార్జునసాగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టానికి అడుగు దూరంలో ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, సోమవారం సాయంత్రానికి 589 అడుగులుగా(309.0570 టీఎంసీలు) నమోదైంది. కుడి, ఎడమ కాల్వలకు కలిసి మొత్తంగా40,912 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, అక్టోబరు 14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ ఆలయంలో హరిహరాదులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభువు స్వామివారికి వైష్ణవ పాంచరాత్రాగమనరీతిలో, పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామి స్పటికమూర్తులకు శైవాగమనరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 27,13,654ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.





మహా నైవేద్యం

సమర్పయామి

- యాదాద్రి లక్ష్మీనృసింహస్వామికి నిత్యనైవేద్యాల సమర్పణ
- ప్రత్యేక రోజుల్లో మరింత విశేషంగా..
- లడ్డూ, పులిహోర కోసం భక్తుల ఆసక్తి

స్వయంభువుగా వెలసిన యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడు నైవేద్య ప్రియుడు. నిత్యం మూడుపూటలా ఆరగింపులతో విశేష నైవేద్యాల నివేదన ఆలయ విశిష్టతల్లో ఒకటి. ఆలయంలో లడ్డూ ప్రసాదాలకు ప్రత్యేక స్థానం ఉంది. వారం రోజుల పాటు నిల్వ ఉన్నా రుచిలో ఏమాత్రం మార్పు ఉండదు. కొండపై వెలసిన ఆ దేవదేవుడిని భక్తులు లడ్డూ ప్రసాదం రూపంలో దర్శించుకుంటారు. ఎంతో ప్రాముఖ్యం గల ప్రసాదాన్ని భక్తుల రద్దీకి తగ్గట్టుగా అందించేందుకు ఆలయ అధికారులు కృషి చేస్తూనే ఉంటారు. భక్తులు మొక్కుబడిగా స్వామికి సమర్పించుకునే భోగాలను ప్రాకార మండపంలోని రామానుజ కూటమిలో తయారు చేసి నివేదిస్తారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి అర్బన్)

స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ నుంచి రాత్రి శయనోత్సవ సేవ వరకు జరుగు అన్నిరకాల పూజల్లో భక్తులు పాల్గొనే సౌకర్యం ఉంది. దంపతులు రూ. 5,116 చెల్లించి పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. అదేవిధంగా కొండకింద తులసీ కాటేజీ పాత బస్టాండ్ ఎదురుగా దేవస్థానం అద్దె గదులు అందుబాటులో ఉండగా దివ్య విమాన రాజగోపురం బంగారు తాపడానికి ఇండియన్ బ్యాంకు ఖాతా నంబరు 6814884695, ఐఎఫ్ఎస్‌సీ : ఐడీఐబీ000వై011, అన్నప్రసాద విరాళాల కోసం యూనియన్ బ్యాంకు ఖాతా నంబరు 006110100000016, ఐఎఫ్ఎస్‌సీ : యుబీఐ0828092 దాతలు విరాళాలు అందజేయాలి.

భక్తులచే జరిపించే భోగాలు

భోగాలు	రుసుం
పులిహోర	రూ.300
లడ్డూ భోగం	రూ.800
దద్దోజనం	రూ.300
కట్టె పొంగళి	రూ.500
చక్కెర పొంగళి	రూ.500
వడ భోగం	రూ.300
బెల్లం పొంగళి	రూ.500
కారా బూందీ	రూ.500
క్షీరాన్నం	రూ.1,000
దోశ భోగం	రూ.300
కేసరీబాత్	రూ.500
శొండెలు	రూ.300
సిరా భోగం	రూ.800
బజ్జీల భోగం	రూ.500
కీర్ భోగం	రూ.1,000
శర్కరి శీతలం	రూ.200
జిలేబి భోగం	రూ.1,000
వడపప్పు	రూ.200



ఏడాది	బరువు (గ్రాముల్లో)	ధర (రూపాయల్లో)
1982	165	0.50
1984	165	.60
1987	165	2.25
1990	165	3
1993	160	6
1995	80	5
2010	100	6
2011	100	10
2017	100	15
2018	100	20
2020	100	30

- 2006లో ప్రవేశ పెట్టిన 500 గ్రాముల స్పెషల్ లడ్డూ రూ.50లు ఉండగా ఆ తర్వాత రూ.100 నుంచి ప్రస్తుతం రూ.150కి పెరిగింది.

- 1982 నుంచి రోజువారీగా 60 కిలోలతో 200 లడ్డూలు తయారు చేసేవారు. కాగా, శని, ఆదివారాలతో పాటు ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా 10 మంది లడ్డూలను తయారు చేస్తుండేవారు. ప్రస్తుతం యంత్రాల ద్వారా 10 మంది పర్మినెంట్, 20 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో లడ్డూలు తయారు చేస్తున్నాయి. రోజుకు 50 వేలకు పైగా లడ్డూలు తయారవుతున్నాయి.

యాదాద్రి క్షేత్రంలో ప్రసాదాల్లో పులిహోర, లడ్డూ అత్యంత ముఖ్యమైనవి. పులిహోర 12 పదార్థాలతో, తొమ్మిది పదార్థాలతో లడ్డూ తయారుచేస్తారు. నిత్యం సుమారు 30వేల పులిహోర, 20 నుంచి 30వేలు ప్రత్యేక, పర్వదినాల్లో 50నుంచి 60వేల లడ్డూలు అనుభవం గల వంట ఆధ్వర్యంలో యంత్రాల ద్వారా తయారు చేయిస్తుంటారు. యంత్రాల ద్వారా లడ్డూ తయారు చేసే ఏకైక ఆలయంగా యాదాద్రి నిలిచింది. 28 మార్చి 2023లో కేంద్ర ప్రభుత్వం ఇక్కడి లడ్డూ నాణ్యతకు గుర్తింపుగా 'భోగ్' ధ్రువపత్రం కూడా అందజేసింది. లడ్డూ తయారీకి 40 ఏళ్లుగా మదర్ డెయిరీ నిత్యం 700కిలోల నెయ్యిని ల్యాబ్ నివేదికతో సరఫరా చేస్తోంది. అదే నెయ్యిని దేవస్థానం వారు హైదరాబాద్‌లోని నాచారం ప్రభుత్వ ఫుడ్ పరీక్షల కేంద్రానికి ప్రతి నెలా పంపిస్తుంది.



లడ్డూలను చుడుతున్న వంట సిబ్బంది

1960 నుంచే లడ్డూ విక్రయాలు

15వ శతాబ్దం నుంచి క్షేత్రంలో లడ్డూ, పులిహోర సమర్పించే సంప్రదాయం ఉంది. 1960 నుంచి భక్తులకు లడ్డూప్రసాదాలు దేవస్థానం విక్రయిస్తోంది. స్వామి వారికి నైవేద్యాలకు సంబంధించి వంటలు రామానుజ కూటమి, భక్తుల కోసం ప్రసాదాల కౌంటర్‌లో తయారు చేసే ఈ ప్రసాదాలు ముందుగా స్వామివారికి సమర్పించడం ఆనవాయితీ. మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం మిల్లెట్ లడ్డూ, బెల్లం లడ్డూలు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మిల్లెట్ల లడ్డూ మాత్రమే అందుబాటులో ఉంది.



ప్రసాదాల కౌంటర్ వద్ద బారులు తీరిన భక్తులు(ఫైల్)




యంత్రం ద్వారా వస్తున్న బూందీని పరిశీలిస్తున్న ఈవో భాస్కర్‌రావు(ఫైల్)





యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులకు ఒక స్పెషల్ లడ్డూను ఉచితంగా అందజేస్తారు. ధర్మదర్శనంతో పాటు స్పెషల్ దర్శనాలు చేసుకునే భక్తులు స్వామి వారి దర్శన అనంతరం కౌంటర్ల ద్వారా ఎన్ని లడ్డూలనైనా కొనుగోలు చేయవచ్చు. ప్రత్యేక రద్దీ రోజుల్లో మాత్రమే భక్తుడికి ఇన్ని లడ్డూలు అన్నట్లు ఆ రోజు విక్రయాలను నిర్ణయిస్తారు.



నిత్యభోగాలు

- వేకువజామున బాలభోగం (దద్దోజనం)
- మధ్యాహ్నం రాజభోగం (పులిహోర, లడ్డూ, వడ)
- రాత్రికి మహానివేదన (శీతలం, వడపప్పు, శొండెలు, దోశ)

వీటితో భక్తులు సమర్పించిన ప్రసాదాలూ..

ప్రత్యేక రోజుల్లో

- మార్గళి వేడుకలు జరిపే ముప్పై రోజుల పాటు స్వామివారికి విశేషప్రసాదంగా కట్టె పొంగలి నివేదిస్తారు.
- తిరుప్పావై మాసంలో 25వ పాశురం రోజున సిరా ప్రసాదం, 27వ పాశురం కూడారై రోజున క్షీరాన్న ప్రసాదాన్ని బంగారు, వెండి గంగాళాలలో నివేదించడం ఆలయ సంప్రదాయం.
- ముక్కోటి ఏకాదశి రోజున కేసరీబాత్, శ్రీరామనవమి రోజున శీతలం, వడపప్పు, ఉగాదిన ఉగాదిపచ్చడి, భక్ష్యాలు, కార్తీకపౌర్ణమి పర్వదినాన మధ్యాహ్నం అన్నంరాశిగా పోసి అన్నకూటం, కదంబం, దీపావళికి లడ్డూ ప్రసాదం, శరత్‌పౌర్ణమికి ఖీర్(పాయసం), కృష్ణాష్టమి, ఆండాల్ తిరునక్షత్రం, అధ్యయనోత్సవాల సందర్భంగా ప్రత్యేక నివేదనలు జరుగుతాయి.
- స్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు జరిగే శ్రీపుష్పయాగం సందర్భంగా పన్నెండు రకాల ప్రసాదాలు నివేదిస్తారు. చక్కెర పొంగలి, బెల్లం పొంగలి, బజ్జీలు, కారబూందీ, కేసరీబాత్, పూర్ణాలు, క్షీరాన్నం, జిలేబీ, సిర, కట్టె పొంగలి, లడ్డూ, వడతో పాటు భక్తుల మొక్కుబడి భోగాలు సమర్పిస్తారు.

జీవనది.. కాలకూటవిషంలా మారినది

(మొదటి పేజీ తరువాయి)

ఆజామాబాద్, ఉప్పల్, మల్లాపూర్, నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలతో పాటు, దిగువన యాదాద్రి జిల్లాలోని పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థరసాయనాలు మూసీనదిని కలుషితం చేస్తున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ పరిరక్షణ వేదికలు, మూసీ పరిరక్షణ ఉద్యమకారులు, శాస్త్రవేత్తల అధ్యయనాలు, నివేదికల ప్రకారం మూసీ నదిలో ప్రతిరోజూ 2,877 మిలియన్ లీటర్ల కలుషితనీరు కలుస్తోంది. అందులో మహానగర మురికినీరు 1,225 మిలియన్‌లీటర్లుంటే, పారిశ్రామిక వ్యర్థాల నీరు 1,652 మిలియన్ లీటర్లు ఉంది. హైదరాబాద్ మహానగరంలో ప్రతిరోజూ దాదాపు 2,000 ఎంఎల్‌డీ మురుగునీరు ఉత్పత్తి అవుతుండగా, అందులో ఇప్పటివరకు నగరంలో అందుబాటులో ఉన్న ఎస్టీపీలు (సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) ద్వారా సుమారు 775 ఎంఎల్‌డీ మురుగు శుద్ధి అవుతోంది. మిగిలిన 1,225 ఎంఎల్‌డీ మురుగునీరు ప్రతిరోజూ మూసీలో కలుస్తోంది. ప్రస్తుతం ఈనీటిని శుద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం కట్టింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న 25 ఎస్టీపీలకు తోడు తాజాగా, 39 ఎస్టీపీలను నిర్మించేందుకు రూ.3,849 కోట్ల నిధులను కేటాయించింది. అయితే మహానగర మురుగునీరు కలవకుండా నిరోధించడంతోనే మూసీ నీరు స్వచ్ఛంగా మారదు. పారిశ్రామిక వ్యర్థాలను కూడా నదిలో కలవకుండా నిరోధించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. పారిశ్రామిక వ్యర్థాలను, రసాయనాలను శుద్ధిచేసే పరిశ్రమలు ఏర్పాటు చేసి వీటిని శుద్ధిచేసేలా ఈ ప్రాజెక్టులో చేర్చాలని మూసీపరివాహక ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అందుకోసం అవసరమైన కార్యాచరణను చేర్చాలని సూచిస్తున్నారు.

తీవ్రస్థాయిలో కాలుష్యం

నదుల కాలుష్యంపై ఇటీవల 'ది ప్రొసిడింగ్స్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్' ఒక నివేదిక ప్రచురించింది. మూసీ నదిపై స్విస్ ఆర్గనైజేషన్ అధ్యయనం చేయగా, దాని ప్రకారం ప్రపంచంలో అత్యంత కాలుష్యపూరితమైన నదుల్లో మూసీ 22వ స్థానంలో ఉంది. నదుల నీటి నాణ్యత ఇండెక్స్‌లో ఆక్సిజన్ స్థాయిలను ప్రభావితం చేసే టర్బిడిటీ స్థాయిలు 1-4 వరకు మాత్రమే ఉండాలి. అయితే మూసీనీటిలో వలిగొండ వద్ద 13గా, దామరచర్ల వద్ద 15గా, వాడపల్లి వద్ద 13గా నమోదైంది. అదేవిధంగా ప్రమాదభరిత డయేరియా, చర్మవ్యాధులు, జ్వరానికి దారితీసే కొలిఫాం బ్యాక్టీరియా నీటిలో అసలు ఉండకూడదు. అయితే మూసీనదిలో కొలిఫాం భారీగా నమోదైంది. వలిగొండ వద్ద 2,200, దామరచర్ల వద్ద 1,400, వాడపల్లి వద్ద 1,500గా కొలిఫాం నమోదవడం మూసీనది నీటి కాలుష్యపరిస్థితిని తెలుపుతోంది. అదేవిధంగా నీటిలో కీలకమైన బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ స్థాయి 3మిల్లీగ్రాములకు లోబడి ఉండాలి. కాగా, మూసీలో ఇవి వలిగొండ వద్ద 10.01శాతంగా నమోదైంది.

మూసీనీటిలో కలుస్తున్న రసాయనాలు

ఆర్సెనిక్, క్రోమియం, కాపర్, నికెల్, లెడ్, నీటిలో కలవని రసాయనవ్యర్థాలు, ప్లాస్టిక్, లోహాలు, ఆల్కలైన్లు, యాసిడ్స్, కాడ్మియం, సిల్వర్‌బ్రోమైడ్, ఆయిల్స్, గ్రీజ్, ఆర్గానిక్ వ్యర్థాలు మూసీ నీటిలో కలుస్తున్నాయి. ఈ నీటితో పండించే పంటల్లో భారలోహాలున్నట్లు పలు పరిశోధనల్లో తేలింది. ఈ నీటిని తాగినా, ఈ నీటితో పండే పంటలు తిన్నా క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలతో పాటు, గుండె, ఊపిరితిత్తులు, మహిళలకు గర్భస్రావ సమస్యలు, చర్మవ్యాధులు సోకుతున్నాయని గుర్తించారు. ఈ నీటిని వినియోగించే వ్యవసాయ భూముల్లో సారం పోయి పంటలు పండని దుస్థితి నెలకొంది. చెరువుల్లో చేపలు, గడ్డిమేసే పశువులు, నీళ్లుతాగే పక్షులు సైతం పునరుత్పత్తి శక్తికి కోల్పోయినట్లు పరిశోధనల్లో గుర్తించారు.



ముక్త అనంతారంలో ప్రవహిస్తున్న మూసీ నది

పరిమితికి మించి లెడ్

మూసీ కలుషిత నీటిలో లెడ్ శాతం పరిమితికి మించి ఉండడంతో దాని ప్రభావం నీటిపైనా, భూసారంపైనా, పశువుగ్రాసంపైనా, పాలపైనా పడింది. గతంలో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ ప్రాంతంలో నీటిలో లెడ్ 0.684శాతం, భూమిలో 0.773శాతం, పశుగ్రాసంలో 0.652శాతం, పాలల్లో 0.601శాతంగా నమోదైంది. సోలిపేట వద్ద నిర్వహించిన అధ్యయనంలో నీటిలో 0.414శాతం, భూమిలో 0.384శాతం, పశుగ్రాసంలో 0.102శాతం, పాలలో 0.132శాతంగా నమోదైంది. సూర్యాపేట వద్ద జరిపిన అధ్యయనంలో నీటిలో 0.208శాతం, భూమిలో 0.355 శాతం, పశుగ్రాసంలో 0.411శాతం, పాలల్లో 0.496శాతంగా నమోదైంది. ఈ అధ్యయనంలో సూర్యాపేట, చౌటుప్పల్ ప్రాంతాల్లో భూమిలో, నీటిలో, పాలల్లో లెడ్ ఉండాల్సినదానికంటే పలు రెట్లు అధికంగా ఉంది. దీంతో ఈ నీటిని, పాలను తాగితే జీర్ణకోశవ్యాధులు, వాంతులు, విరేచనాలు అవుతున్నాయని, మూత్రపిండాల వ్యాధులు, చర్మవ్యాధులు వస్తున్నాయని నిర్ధారించారు. అంతేగాక ఈప్రాంత భూముల్లో పండే పంటల్లోనూ లెడ్ శాతం ఎక్కువగా ఉండడం వల్ల వాటి ఉత్పత్తులు అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయని గుర్తించారు. ఈ ప్రాంతాల్లో కొన్నేళ్లుగా మూసీనీటి వినియోగం వదిలేసిన ప్రజలు స్థానికంగా ప్యూరిఫైడ్ వాటర్‌ను వినియోగిస్తున్నారు. ఇటీవల మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం అందించే రక్షిత మంచినీటి జలాలతో ఇక్కడి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలిగింది.

బుద్ధుడి బోధనలతో రుగ్మతల పరిష్కారం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎండీ ప్రకాష్‌రెడ్డి

నాగార్జునసాగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజ రుగ్మతల పరిష్కారానికి బుద్ధుడి బోధనలే శరణ్యమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఉన్న బుద్ధవనంలో నిర్వహించిన దమ్మ విజయం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత బుద్ధుడి పాదాల వద్ద బౌద్ధ మాంక్‌లతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సామ్రాట్ అశోక చక్రవర్తి వంటి గొప్ప వ్యక్తులు అక్టోబరు 14వ తేదీన బౌద్ధమతాన్ని స్వీకరించారని తెలిపారు. స్వార్థం మితిమీరిపోతూ అత్యాశ తారస్థాయికి చేరి అతలాకుతలం అవుతున్న ప్రస్తుత సమాజానికి బుద్ధుడి పంచశీల పాటిస్తే యుద్ధాలు జరగవన్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ ఇక్ష్వాకుల కాలంలో నాగార్జునసాగర్‌లో నాగార్జునకొండపై విరాజిల్లిన బౌద్ధాన్ని ప్రస్తావిస్తూ రాబోయే రోజుల్లో బుద్ధవనం అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు.

అన్ని హంగులతో తీర్చిదిద్దుతాం : పటేల్ రమేష్‌రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో బుద్ధవనాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుద్ధవనం ఆసియాలోనే అతిపెద్ద థీమ్ పార్కుగా గుర్తింపు పొందిందన్నారు. అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం వల్లే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించగలిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, శివనాగిరెడ్డి, శ్యాం, బైలా కుప్పే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, కంది ఐఐటీ విద్యార్థులు, బుద్ధిస్టు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మగువ ముందడుగు

- ఒడిదొడుగులు ఎదురైనా ఓర్పుతో ముందుకు సాగుతున్న మహిళలు
- కుటుంబాలకు చేదోడు వాదోడు
- కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న మహిళలు

అభిరుచి ఉంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చని నిరూపిస్తున్నారు మహిళలు. వంటింటికే పరిమితం కాకుండా స్వశక్తితో ఎదిగి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తమకు లభించే ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వెనుకంజ వేయకుండా తాము ఎంచుకున్న లక్ష్యంగా దిశగా అడుగులు వేస్తున్నారు. కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటూ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారు. కుటుంబాలు కష్టాల్లో ఉన్నా ఓర్పుతో ముందుకు సాగుతున్నారు. ఆస్తిపాస్తులు లేకున్నా రెక్కల కష్టాన్నే నమ్ముకుని ముందుకు సాగుతున్నారు. మంచి స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు వస్తుందని, తాము చేస్తున్న పని ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సమాజంలో భాగస్వాములవుతున్నారు.

నేడు గ్రామీణ మహిళా దినోత్సవం

ఒడిదుడుకులు ఎదురైనా..



కారం గిర్ని వద్ద ప్రమీల

నార్కట్‌పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి ప్రమీలకు సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డితో వివాహమైంది. కూతురికి ఐదేళ్లు, కుమారుడు ఏడు నెలల శిశువుగా ఉన్న సమయంలో భర్త, అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. భయంతో బతుకు జీవుడా అంటూ ఆమె తన పిల్లలను వెంటబెట్టుకుని కట్టుబట్టలతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి వచ్చింది. అప్పటి నుంచి భర్తకు దూరంగా ఉంటోంది. అసలు భర్త ఉన్నాడో లేడో కూడా తెలియనంతగా అత్తింటి వారితో సంబంధాలు తెగిపోయాయి. తమ సమీప బంధువుల సహకారంతో నార్కట్‌పల్లిలో తొలుత స్థానికంగా ఉన్న ఓ కంపెనీలో దినసరి కూలీగా కొన్నేళ్లు పనిచేసింది. ఆస్తిపాస్తులు లేకపోగా రెక్కల కష్టమే తప్ప మరే సంపాదన లేదు. దినసరి కూలీ పని చేస్తే వచ్చే డబ్బులు సరిపోయేవి కావు. అయినా పస్తులుంటూనే పిల్లలను చదివించింది. కుమారుడు మహేశ్‌రెడ్డి ఇంటర్‌వరకు చదవగా కూతురు మమత పదో తరగతి వరకు చదివించింది.

కారం గిర్నితో ఉపాధి

ప్రమీల సమభావన సంఘంలో సభ్యురాలిగా చేరింది. తొలుత రూ.20వేల రుణ సౌకర్యం తీసుకుని కారం గిర్ని ఏర్పాటు చేసుకుంది. తర్వాత అనివార్య కారణాలతో తీసేసినా మళ్లీ అదే ఉపాధిని పునఃప్రారంభించి 25 ఏళ్లుగా అదే ఉపాధిని కొనసాగించి తన రెక్కల కష్టంతో సంపాదించిన డబ్బుతోనే వారికి వివాహాలు చేసింది. తల్లిగా తన బాధ్యతను నెరవేర్చింది. కారం గిర్నిని నడపడంతో వచ్చిన ఆరోగ్య సమస్యలతో కొన్నాళ్ల పాటు ఆ పనిని నిలిపివేసింది. తిరిగి ప్రారభించినా గిరాకీ రాకపోవడంతో పరిస్థితుల్లో ఆమెకు ఒంటరి మహిళ పింఛన్ ఆధారమైంది.

అత్మవిశ్వాసమే ఆయుధంగా..





పంచర్ చేస్తున్న షేక్ ముంతాజ్‌బీ

పెన్‌పహాడ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పంచర్ షాపు నడిపిస్తూ తన కుటుంబాన్ని ఆసరాగా నిలుస్తోంది సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన షేక్ ముంతాజ్‌బీ. భర్త చాంద్‌పాషా, కూతురు, అత్తతో కలిసి గ్రామంలోని చౌరస్తాలో చిన్న రేకుల గదిలో నివాసముంటున్నారు. వీరికి సెంటు భూమి లేదు. కుమారుడు మున్నా 17ఏళ్ల వయస్సులో అనారోగ్యంతో మృతిచెందాడు. కుమారుడి మరణంతో భర్త చాంద్‌పాషా మనస్తాపం చెంది అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. భర్త, కూతురు, అత్తను సాకే బాధ్యత ఆమెపై పడింది. ఆమె పట్టుదలతో పంచర్ రిపేర్ దుకాణం నడిపిస్తూ కుటుంబ సభ్యులను పోషిస్తోంది. దుకాణం నడవని స్థితిలో ఇల్లు గడిచే పరిస్థితి లేదని ముంతాజ్‌బీ ఆవేదన వ్యక్తం చేస్తుంది. తనకు రేషన్‌కార్డు లేక పోవడంతో ప్రభుత్వం అందజేసే నిత్యావసర సరుకులు, ప్రభుత్వం నుంచి రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందడంలేదని వాపోయింది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తే దుకాణాన్ని మెరుగుపర్చుకొని జీవనోపాదిని పెంచుకుంటానని ఆమె ఆవేదనతో తెలిపారు.

మనో ధైర్యంతో ముందుకు

తుర్కపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలకేంద్రానికి చెందిన ఏశాల శారద ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు. పై చదువులు చదువాలని ఉన్నా 10వ తరగతి పాసై వృత్తివిద్యా కోర్సుల్లో టైలరింగ్ పూర్తి కాగానే వివాహమైంది. టైలరింగ్ పట్ల ఆమెకు ఏ మాత్రం ఇష్టం లేకపోవడంతో ఫొటోగ్రఫీపై దృష్టి సారించింది. భర్త కృష్ణ ప్రొత్సాహంతో ఫొటోగ్రాఫర్‌గా మారింది. 1993 నుంచి ఫొటో స్టూడియోను నడుపుకుంటూ కుటుంబ పోషణలో భర్తకు సహకారం అందిస్తోంది. వివిధ గ్రామాల నుంచి సమభావన సంఘాల మహిళలు, కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ఆమె వద్దే ఫొటోలు తీయించుకుంటారు. శారదకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలోనూ ప్రావీణ్యం ఉంది. డిజిటల్ కెమెరా ద్వారా ప్రింటర్ సహాయంతో ఐదు నిమిషాల్లో కలర్ ఫొటోలు ఇస్తుంది. అప్పట్లో నెగెటివ్ డెవలప్‌మంట్, ఫొటో ప్రింటింగ్‌లో కూడా నేర్పరి. భర్త అవుట్ డోర్‌కు వెళ్తే ఆమె మాత్రం స్టూడియోలోనే ఉండి ప్రజలకు సేవలందిస్తోంది. ఫొటోగ్రఫీ వృత్తిలో రాణిస్తున్న శారదను 2015 ఆగష్టు 23న తెలంగాణ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయిలో సన్మానించింది. 2018 జనవరిలో ఫొటో గ్రాఫర్ల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు.



ఫొటో గ్రాఫర్‌గా రాణిస్తూ..

మర్రిగూడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్ది స్వప్న ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తోంది. భర్త రాంబాబు మర్రిగూడలో ఓ డబ్బా పెట్టుకొని ఫొటోలు తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని రాణించాలని సంకల్పంతో ఫొటో స్టూడియోలో తాను కూడా రెండు సంవత్సరాల నుంచి ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తోంది. ఫొటో స్టూడియోలో ఫొటోలు తీయడమే కాకుండా వివాహాలకు, శుభకార్యాలకు వెళ్లి భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. మర్రిగూడ మండలంలోనే కాకుండా ఇతర మండలాలకు వెళ్లి వివాహాలకు ఫొటోలు తీస్తూ ముందుకు సాగుతోంది. కుటుంబపోషణతో పాటు అత్తమామల బాగుగోగులు చూసుకుంటోంది. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, ఇప్పుడు మాకు ఎలాంటి లోటు లేదని చెబుతోంది స్వప్న.





నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాత సేవ:ఉదయం 3.30నుంచి4.30వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 12.00నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1-4 వరకు సర్వ దర్శనాలు.
తిరువారాధన:సాయంత్రం 7నుంచి7.0గంటల వరకు
సహస్రనామార్చన:రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
రాత్రి నివేదన: రాత్రి 9:30 గంటల నుంచి 9:45 వరకు
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 7 నుంచి 9 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు:ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్ , (ఆంధ్రజ్యోతి)

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	230	260
సూర్యాపేట	రూ.145	200	250
నల్లగొండ	రూ.148	216	244

గరిష్ఠం 29.5 | కనిష్ఠం 23.8

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589
టీఎంసీలు	309.0570
ఎడమకాల్వకు నీటి విడుదల	5948
కుడికాల్వకు	3257
విద్యుత్ కేంద్రం ద్వారా	28.907
సాగర్‌కు నీటి రాక	69.957
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2.400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	40.912 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.94 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	20.874
నీటి విడుదల	36.874

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.50 అడుగులు
టీఎంసీలు	4.31
ఇన్‌ఫ్లో	994.43 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	469.01 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

ఆర్థిక వివాదాల నేపథ్యంలో బలవన్మరణం



మమత(ఫైల్)

భువనగిరిరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్థిక వివా దాల నేపథ్యంలో ఓ మహిళ బలవన్మరణానికి పాల్ప డింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జిట్టోళ్లబావి గూడెంలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడకు చెందిన నాగారం మమత(27) భర్తతో వివాదాల నేపథ్యంలో కొన్ని రోజులుగా తల్లి వద్దనే ఉంటోంది. మమతకు కుమా రుడు(6) ఉండగా, భర్తతో న్యాయ పోరాటం చేస్తున్నట్లు సమాచారం. జిట్టోళ్లబావిగూడేనికి చెందిన సాయికుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేటు ల్యాబ్ పనిచేస్తూ యూసఫ్‌గూడలో ఉండేవాడు. మమతతో పరిచయం కాగా, ఆమె వద్ద కొంత మొత్తం నగదు తీసుకున్నాడు. అవి తిరిగి చెల్లించాలని అడిగేందుకు మమత ఆదివారం జిట్టోళ్లబావిగూడేనికి వచ్చింది. డబ్బులు ఇవ్వడానికి కొద్దిగా సమయం పడుతుందని సాయికుమార్‌రెడ్డి తేల్చిచెప్పటంతో గ్రామ శివారుకు వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన సాయికుమార్‌రెడ్డి వెంటనే చికిత్స నిమిత్తం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి నాగారం రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. గాంధీ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బేతవోలులో ఇరువర్గాలపై కేసు నమోదు

చిలుకూరు, అక్టోబరు 14: దసరా పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. వట్టికూటి నాగయ్య ఫిర్యాదు మేరకు ఏడుగురిపై, గుండెపంగు రాణి ఫిర్యాదుపై పదిమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు సోమవారం తెలిపారు. అట్రాసిటీ కేసుపై కోదాడ డీఎస్పీ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ కవర్‌లోంచి రూ.50 వేలు చోరీ

మోత్కూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఎదుట పార్క్ చేసిన బైక్ కవర్‌లో ఉంచిన రూ.50 వేలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో సోమవారం జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన ఓర్సురాజు బజాజ్ షోరూంలో పని చేస్తున్నాడు. రాజు ముందుగా ఎస్‌బీఐకు వెళ్లి రూ.లక్ష డ్రా చేసి రూ.50 వేలు జేబులో ఉంచుకొని, మరో రూ.50వేలు బైక్ కవర్‌లో పెట్టాడు. తర్వాత ఆ డబ్బులను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. అ సమయంలో కవర్ లోంచి డబ్బులు తీసుకెళ్లడం మర్చిపోయాడు. డబ్బులు గుర్తు వచ్చి తిరిగివచ్చే లోపే దొంగ డబ్బులు కొట్టేశాడు. ఎస్‌బీఐ నుంచి వెళ్లినప్పటి నుంచే దొంగ అతడిని అనుసరిస్తున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

ఎస్‌వోటీ పోలీసుల దాడులు.. కేసు నమోదు

భువనగిరి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువుల దాణా దుకాణంలో పటాకులు విక్రయిస్తుండడంతో ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గల వీఎస్ఆర్ పశువుల దాణా దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా పటాకులు విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి సుమారు రూ.20వేల విలువైన పటాకులు స్వాధీనం చేసుకున్నారు.

గుర్రంపోడు ఎస్ఐ సస్పెన్షన్

గుర్రంపోడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీపీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు సోమవారం జారీ చేశారు. గుర్రంపోడు మండలంలోని ముల్కలపల్లి గ్రామానికి చెందిన జాల రజిత ఆగస్టు 29న హత్యకు గురైంది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి హత్య కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి ఇద్దరు నిందితులను తప్పించేందుకు ఓ కానిస్టేబుల్ ద్వారా రూ.లక్ష లంచం తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఎస్పీ శరత్‌చంద్రపవార్ కేసు విచారణ బాధ్యతలను ఏఎస్పీ రాములునాయక్‌కు అప్పగించారు. లంచం తీసుకున్నది వాస్తవమేనని విచారణలో తేలడంతో నివేదికను ఐజీపీకి సమర్పించారు. దీంతో ఎస్ఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దారులన్నీ రాజధాని వైపే

● రెండో రోజూ జాతీయ రహదారిపై తగ్గని వాహనాల రద్దీ ● ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిట



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విజయవాడ జాతీయరహదారి(ఎన్‌హెచ్-65)పై సోమవారం వాహనాల రద్దీ కొనసాగింది. స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్ బాటపట్టారు. కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాల్లో రాజధాని బాటపడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద వాహనాల రద్దీ నెలకొంది. వాహనాలు టోల్‌గేట్ వద్ద బారులు తీరాయి. 16గేట్లకు 9గేట్ల ద్వారా వాహనాలను హైదరాబాద్ వైపు పంపించారు. సాధారణ రోజులలో 30 నుంచి 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా సోమవారం 46 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించినట్టు టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు. చౌటుప్పల్‌పట్టణంలో వేలాది వాహనాలతో రద్దీగా మారింది. సొంతూళ్లలో బతుకమ్మ, దసరా పండుగల కోసం వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఈ నెల 15నుంచి విద్యా సంస్థలు తెరుచుకొనుండడంతో నగరంబాట రహదారి వాహనాలతో కిక్కిరిసింది.

సొంతూళ్ల వెళ్లి గమ్యస్థానాలకు చేరుతూ..

భువనగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు సొంతూ ళ్లకు వచ్చిన వారు తిరుగు గమ్యస్థానాలకు వెళ్తుండడంతో సోమవారం భువనగిరి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో బస్సుల కోసం ప్రయా ణికులు పడిగాపులు కాశారు. బస్సులు వచ్చినా సీట్లకు మించి ప్రయాణికులు ఎక్కడంతో అన్ని బస్సులు కిక్కిరిశాయి. పలువురు ప్రయా ణికులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. యాదగిరిగుట్ట డిపో మేనేజర్ బి శ్రీనివాస్‌గౌడ్ రోజంతా బస్టాండ్‌లోనే ఉండి బస్సుల రాకపోకలను, ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించారు. స్వయంగా ప్రయాణికులను బస్సుల్లో ఎక్కించి డ్రైవర్, కండక్టర్లకు, ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రయాణికులతో బస్సులు కిటకిట

నార్కట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి): దసరా పండుగతో పాటు సెలవులు కూడా ముగియడంతో స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులతో బస్సులు కిక్కిరిస్తున్నాయి. పట్టణాల నుంచి పండుగ కోసం పల్లెబాట పట్టిన గ్రామీణ ప్రాంత ప్రజలు తిరిగి పట్టణాల బాట పడుతున్నారు. హైద్రాబాద్‌కు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. ప్రయాణికులకు సరిపడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఓ వైపు ఆర్టీసీ అధికారులు చెబుతున్నా బస్టాండ్లలో వేచి ఉన్న ప్రయాణికుల సంఖ్యను చూస్తే బస్సులు సరిపోవడం లేదు. దీంతో కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా ఇదే అదనుగా ప్రైవేట్ ఆపరేటర్లు రేట్లు పెంచారు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు ప్రయాణం చేస్తుండగా మరికొందరు తమ ప్రయాణాలను రెండు రోజుల కోసం కూడా వాయిదా వేసుకున్నారు. సొంత వాహనాలు ఉన్న మరికొందరు మాత్రం ఆదివారం నుంచే స్వస్థలాకు చేరుకోవడం మొదలుపెట్టారు. దీంతో నార్కట్‌పల్లి బస్టాండ్‌లో రద్దీ కన్పించింది. ఆర్టీసీ అధికారులు కూడా సిబ్బందికి వీలైనంత మేరకు సెలవులు ఇవ్వకుండా రూట్ ఆపరేషన్‌లో ఉండేలా కృషి చేస్తున్నారు.

చింతపల్లి, (ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి ప్రజలు వాహనాల ద్వారా హైదరాబాద్‌కు తరలివెళ్తున్నారు. దేవరకొండ, కొండమల్లేపల్లి, సాగర్ నుంచి హైవేపై వాహనశ్రేణి బారులు తీరాయి. దీంతో ఎక్కడ చూసిన వాహనాలతో సాగర్-హైదరాబాద్ రహదారి కిక్కిరిసింది.

రెండో రోజూ అదే జోరు..

కేతేపల్లి, (ఆంధ్రజ్యోతి): 65వ నెంబర్ జాతీయ రహదారిపై పండగ వాహనాల రద్దీ సోమవారం రెండో రోజూ కొనసాగింది. ఆదివారం ఉదయం రహదారిపై ప్రారంభమైన వాహనాల సందడి సోమవారం ఉదయం వరకూ కొనసాగింది. ఆ తర్వాత కొంత మేర వాహనాల రద్దీ తగ్గింది. సద్దుల బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో హైదరాబాద్‌లో నివసించే వారు విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు చెందిన వారు స్వంత గ్రామాలకు ఐదు రోజుల క్రితం తరలి వెళ్ళారు. పండగలు ముగిసి సెలవులు పూర్తవడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారంతా తమ తమ వాహనాల్లో ఆదివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో 65వ నెంబర్ జాతీయ రహదారి వాహనాల రణగొణ ధ్వనులతో మార్మోగింది. ఒకదాని తర్వాత ఒకటిగా వాహనాలు బారులు కట్టి వెళ్ళాయి. మామూలు రోజుల్లోనే ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారిపై విరామం లేకుండా వెళ్తున్న పండగ వాహనాలతో జాతీయ రహదారి వెంట గల మండలంలోని కొర్లపహాడ్, చీకటిగూడెం, కేతేపల్లి, ఉప్పలపహాడ్ గ్రామాల్లోని జంక్షన్‌ల వద్ద ప్రజలు, రైతులు, గొర్రెలు, మేకల కాపరులు కాలినడకన రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

తిప్పర్తి, అక్టోబరు 14:(ఆంధ్రజ్యోతి) నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీలోని మల్లెపల్లి వారిగూడెం గ్రామానికి చెందిన కొత్త లింగయ్య(79) అదే గ్రామంలో జంగారెడ్డిగూడెం స్టేజీ వద్ద ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో రోడ్డుకు అవతల ఉన్న కిరాణం దుకాణం నుంచి తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడెం నుంచి నల్లగొండ వైపునకు వెళ్తున్న కారు అతివేగంగా వెళ్తూ లింగయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు, కాలుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు, కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సచికిత్స పొందుతూ మృతిచెందాడు. లింగయ్యకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. లింగయ్య పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

మోతె,(ఆంధ్రజ్యోతి): అతివేగంతో బైక్‌ను నడిపి ఫ్లైఓవర్ వెంట ఉన్న సైడ్ డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిలో ఉన్న హుస్సేనాబాద ఫ్లైఓవర్ వద్ద శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం సూర్యానాయక్‌తండాకు చెందిన జాటోత్ వీరన్న(25) సూర్యానాయక్‌తండా నుంచి శనివారం రాత్రి 12 గంటల సమయంలో మోతె మండలం నుంచి ఖమ్మం వైపు వెళ్తుండగా హుస్సేనాబాద స్టేజీ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద అతివేగంతో మూలమలుపులో ఉన్న సైడ్ డివైడర్‌కు ఢీకొన్నాడు. తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి గస్తీ నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా సిబ్బంది 1033 వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. వీరన్న తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బంగారం కొనుగోలుకు మొబైల్ వాహనం

రాష్ట్రంలో మొట్టమొదటిసారి క్యాప్స్‌గోల్డ్ అనుబంధ సంస్థ వ్యాల్యూ ఆఫ్ గోల్డ్ మొబైల్ గోల్డ్ ఏర్పాటు

మిర్యాలగూడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొట్టమొదటిసారి బంగారం కొనుగోలు చేసే మొబైల్ వాహనం వ్యాల్యూ గోల్డ్ ఏర్పాటు చేసినట్లు వాల్యూగోల్డ్ అధినేత అభిషేక్ చందా తెలిపారు. మిర్యాలగూడలో సోమవారం అయన మాట్లాడుతూ 1901నుంచి బులియన్ వ్యాపారంలో ఉన్న వ్యాల్యూగోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాప్స్ గోల్డ్ అనుబంధ సంస్థ క్యాప్స్ గోల్డ్ రిటైల్ జ్యూవెలరీ, జ్యూవెలరీ తయారీ, గోల్డ్ రీఫైనరీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరాల కోసం బంగారం అమ్మాలనుకునేవారికి వ్యాల్యూ గోల్డ్ బంగారం అమ్మేందుకు అవసరమైన వెసులుబాటు కల్పిస్తుందన్నారు. 2023 సెప్టెంబరు 23న వ్యాల్యూ గోల్డ్‌ను హైద్రాబాద్‌లో ప్రారంభించి అనతికాలంలోనే బంజారాహిల్స్, సికింద్రాబాద్, ఉప్పల్, కూకట్‌పల్లి తోపాటు ఇటీవల్ చింతల్ ప్రాంతాలకు కూడా సేవలను విస్తరించినట్లు తెలిపారు. కస్టమర్‌లకు మెరుగైన మరిన్ని సేవలు అందించేందుకు వాల్యూ గోల్డ్ గ్రామాలకు విస్తరించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణలో మొదటగా బంగారం కొనుగోలు చేసే వాహనాన్ని తయారు చేశామని, 2024 జూన్22న సారథి స్టూడియోలో అనసూయ భరద్వాజ్ ప్రారంభించారని తెలిపారు. హైదరాబాద్ బ్రాంచ్‌లలో ఉన్న బంగారం కొనుగోలు ప్రక్రియలన్నీ వాహనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మకానికి తెచ్చిన బంగారం నాణ్యతను పరీక్షించి, అధిక విలువ కోసం బంగారం కరిగించి, తక్షణమే డబ్బు పొందవచ్చునని తెలిపారు. గోల్డ్‌లోన్‌లో ఉన్న బంగారాన్ని తామే విడిపించి మార్కెట్ ధరకు కనుగోలు గరిష్ఠ ధర కల్పిస్తామన్నారు. వ్యాల్యూ గోల్డ్ వాహనం అక్టోబరు 14నుంచి 18వ తేదీ వరకు నల్లగొండలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో, అక్టోబరు 19నుంచి 23వ తేదీ వరకు మిర్యాలగూడ సమ్మిడి వీరారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ప్రాంభించనున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సంబురాల్లో భాగంగా సరదా ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి సాగర్ కాల్వలో గల్లంతయ్యాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పొడకంటి వెంకటాచారి(32) మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. దసరా పండుగకు శనివారం స్వగ్రామం దొండవారిగూడెంకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని సాగర్‌కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడాన్ని కుటుంబసభ్యులు గమనించారు. అక్కడే ఉన్న స్థానికులు శ్రీపాద స్రవంతి, అంజాద్ చున్నీతో బయట తీసేందుకు ప్రయత్నించారు. అప్పటికే నీటి ప్రవాహంలో గల్లంతుకావడంతో వారి ప్రయత్నం విఫలమైంది. వెంకటాచారి భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహం ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టగా, సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి గ్రామం వద్ద సోమవారం స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి గరిడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పరిశీలనలో సాగర్‌కాల్వలో లభ్యమైన మృతదేహం ఆనవాళ్లను పరిశీలించి తమకు వచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు వెంకటాచారిగా గుర్తించి కుటుంసభ్యులకు సమాచారమిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. వెంకటాచారి భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు.



కనగల్ సబ్‌మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాస్

1.50 లక్షల మెట్రిక్ టన్నుల

ధాన్యం నిల్వ చేయడానికి ఏర్పాట్లు

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కనగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేయడానికి అన్నిఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను నిల్వ చేయడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన కనగల్ సబ్‌మార్కెట్ యార్డులోని గోదాములను పరిశీలించారు. గోదాముల నిల్వ సామర్థ్యాన్ని, ఇతర వసతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనగల్ సబ్ మార్కెట్ గోదాముల్లో సోమవారం నాటికి ఐకేపీ కేంద్రాల్లో కొనుగోలు చేసిన 2వేల క్వింటాళ్ల వరి ధాన్యం బస్తాలను తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై డీఎస్వో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, తహసీల్దార్ పద్మ, డీటీ దీపక్, ఆర్‌ఐలు యాదగిరి, సునీత, లింగస్వామి తదితరులుపాల్గొన్నారు.

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైదానాయక్

మిర్యాలగూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళాశాలలకు ఫీజులను చెల్లించక పోవడంతో వేల కోట్ల రూపాయలు బకాయి పడిందని అన్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలలు సమ్మెకు నోటీసు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం డిగ్రీ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కళాశాలల యాజమాన్యాల సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు న్యూమాన్, ప్రసన్న, వీరన్న, సంపత్, మణి నాయక్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య

దేవరకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంభాలపల్లి వెంకటయ్య అన్నారు. దేవరకొండలో అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన రోజు సందర్భంగా సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1956 అక్టోబరు 14న బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు ఆయన గుర్తు చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొతం సహదేవుడు, చొల్లేటి భాస్కరచారి, నర్సింహచారి, సైదులు, వెంకటచారి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా దేశాయిపేట వద్ద మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సాగర్‌రోడ్డులో గల జ్యోతీరావు పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంటు వెంకటేశ్వర్లు, దేవతల సైదులు, నామ రవీందర్, మహ్మద్ ఫారూఖ్, రాంబాబు, అంజి, శ్రీను పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి పట్టణ ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ కోరారు. పట్టణంలోని గణేష్‌మార్కెట్, పాతబస్టాండ్, కేఆర్ ఎస్టేట్ తదితర వ్యాపార కూడళ్లలో సోమవారం సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లలో విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు వెంకటరమణ, శ్వేత పాల్గొన్నారు.



అంగడిపేట గ్రామంలోని దుర్గాదేవి శోభాయాత్రలో ఉత్సవ కమిటీ సభ్యులు

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు, భజనలు, కోలాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అంగడిపేట గ్రామంలోని అంజనేయస్వామి గుడి వద్ద తొమ్మిది రోజుల పాటు ఘనంగా కొనసాగిన దేవి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. చీరల వేలంపాట నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను డప్పు, డీజే చప్పుళ్లతో ఊరేగిస్తూ నృత్యాలు చేస్తూ వైభవంగా శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో అంగడిపేట గ్రా మ దేవీనవరాత్రుల ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

వేములపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని డిమాండ్ చేశారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఐద్వా మండల మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళా భరోసా కింద ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. అనంతరం ఐద్వా మండల అధ్యక్షురాలిగా పొదిల లక్ష్మమ్మ, కార్యదర్శిగా అనిరెడ్డి మాధవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఆదిమళ్ల ఇందిరమ్మ, మేడం వీరమ్మ, సరిత, సువర్ణ, నాగమ్మ, సైదమ్మ, కలమ్మ, కళావతి, లింగమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు మందలించారని ఆత్మహత్య

మునుగోడు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మందు మానేయమని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురై ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని కచలాపురం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన జిట్ల ముత్తయ్య(55) అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. మందు మానేయాలని కుటుంబ సభ్యులు కొద్ది రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మనస్థాపానికి గురైన ముత్తయ్య సోమవారం తన వ్యవసాయ బావి వద్ద క్రిమిసంహార మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. గమనించిన సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలునాయక్, మందుల సామేలు

కట్టంగూరు, చిట్యాల, చిట్యాలరూరల్, దేవరకొండ, శాలిగౌరారం, నల్లగొండ రూరల్, కనగల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నేనావత్ బాలునాయక్, మందుల సామేలు, పలువురు అధికారులు అన్నారు. జిల్లాలోని కట్టంగూరు, చిట్యాల, దేవరకొండ, శాలిగౌరారం, నల్లగొండ, కనగల్ మండలాల్లో సోమవారం ఎమ్మెల్యేలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గన్నీ బ్యాగులు తక్కువగా ఉంటే వెంటనే ఆర్డర్ పెట్టాలన్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందని, అలాగే వాటి కోసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని అన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, సాంకేతిక ఇబ్బందులు ఉంటే సరిచేసి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా కృషి చేస్తామన్నారు.



దేవరకొండ: కొండభీమనపల్లిలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



కట్టంగూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

● కట్టంగూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు, పీఏసీఎస్ ఇన్‌చార్జి అధికారి నాగేశ్వర్‌రావు, నాయకులు మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, పెద్ది యాదగిరి, సీఈవో మల్లారెడ్డి వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పరమేష్, వెంకన్న, చంద్రయ్య, శివశంకర్, రాజు, స్వామి, శేఖర్ పాల్గొన్నారు.

● చిట్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, కాటం వెంకటేశం, పరమేశం, ఆంజనేయులు, రాంరెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని వెలిమినేడులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించారు. కష్టపడి సాగు చేసిన ధాన్యాన్ని దళారుల మాటలు నమ్మి విక్రయించిన నష్టపోవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎస్వో వి.వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, డైరెక్టర్లు గడ్డం సత్తిరెడ్డి, పి శాటి భీష్మారెడ్డి, టేకుల కవితఅంజిరెడ్డి, మామిడి శ్రీరాములు, ఏదుళ్ల అజిత్‌రెడ్డి, మేడి స్వామి, ఎంపీడీవో జయలక్ష్మి, ఏవో పగిడిమర్రి గిరిధర్, దేశబోయిన మల్లమ్మ, వెంకటేశం, నర్సింహ, గణేష్, సీఈవో రాజిరెడ్డి పాల్గొన్నారు.

● దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గోదాం వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించి మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు విమర్శలు చేస్తున్నారని, వారి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు, ఎంపీడీవో డానియెల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, ఏడీఏ శ్రీలక్ష్మి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డు, గురజాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సామేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. మూసీ నదిపై గురజాల, చిత్తలూరు గ్రామాల వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం వల్ల ఇక్కడి కరువు పరిస్థితులు తీరుతాయన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ పి.యాదగిరి, సింగిల్‌విండో చైర్మన్ తాల్లూరి మురళి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు వడ్లకొండ పరమేష్, చింత ధనుంజయ్, గూని వెంకటయ్య, ననుబోతు అంజయ్య, ఉపేందర్, జనార్దన్, డైరెక్టర్లు నోముల రవికుమార్, వంగూరి కవిత, వేణుగోపాల్‌రెడ్డి, గణేష్, సతీష్ పాల్గొన్నారు.

● నల్లగొండ మండలంలోని ఖుదావన్‌పూర్, నర్సింగ్‌బట్ల, తొరగల్, మేళ్ల దుప్పలపల్లి, పెద్దసూరారం, చిన్నసూరారం, ఖాజీరామారం, కొత్తపల్లి 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని ఆయన సూచించారు. ధాన్యం ఏ గ్రేడ్ రూ.2320, ఇతర గ్రేడ్ ధాన్యం రూ.2300, సన్న ధాన్యం క్వింటాకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు నిబంధనల మేరకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏపీఎం వినోద, ఏపీవో స్ఫూర్తి, సీసీ గీత, నరసింహ, అంజయ్య, శారద, ఎస్‌ఆర్‌పీ నాగలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని లచ్చుగూడెం, చెట్లచెన్నారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పద్మ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సీఈవో రాంచంద్రారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

● వీవీపీఎస్ చైర్మన్ జి.చెన్నయ్య

నల్లగొండ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ జోలికి వస్తే రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు ఖాయమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య, కో చైర్మన్ బాలకిషన్ హెచ్చరించారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. వీవీపీఎస్ జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీఎన్జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డికి దళితులపై ప్రేమ ఉంటే 15 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 30 శాతానికి పెంచాలని 2014 నుంచి ఎస్సీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యుత్సాహం చూపిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అంశాలను, 2011 జనాభా లెక్కల ఆధారంగా పరిగణిస్తాననడం సరికాదన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లయినా దళితుల స్థితిగతుల అధ్యయనానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా లెక్కలు తీసుకుంటామని సీఎం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళితుల స్థితిగతులపై అధ్యయనం చేసి వెనకబడిన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలను, మూడు ఎకరాల భూమి, దళితబంధు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలల్లో ఎవరూ ఎక్కువ లబ్ధిపొందారో లెక్క తీయాలని అన్నారు. ఇప్పటి వరకు లబ్ధిపొందని వెనకబడిన కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తాళ్లపల్లి రవి, చెరుకు రామచందర్, మేక వెంకన్న, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మంచాల లింగస్వామి, జి.శ్రీను, నల్లాల కనకరాజు, కరణం కిషన్, తలమల్ల హస్సేన్, చింతపల్లి బాలకృష్ణ, గోలి సైదులు, అద్దంకి రవి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న వీవీపీఎస్ నాయకులు

సాగర్‌ను సందర్శించిన సీయూ విద్యార్థులు

నాగార్జునసాగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పర్యాటక కేంద్రం, ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. హైదరాబాద్ నుంచి పర్యాటకశాఖ బస్సులో సాగర్‌కు వచ్చిన 60 మంది విద్యార్థులు మొదటగా బుద్ధవనంలో నిర్వహించిన ధమ్మ విజయం వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ, జలవిద్యుత్ కేంద్రాలను తిలకించారు. వీరితో పాటు ఐఐటీ కంది ఇంగ్లీష్, ఫారెన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ విద్యార్థులు కూడా ఉన్నారు.



బుద్ధవనంలో మహాస్తూపం లోపల సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ: కల్లేపల్లి బంగారు మైసమ్మ ఆలయం వద్ద భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లింగానాయక్ కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏడాదికి సుమారు కోటి రూపాయల ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఆలయం వద్ద భక్తులు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

హాలియా: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ నెల 18వ తేదీన నిర్వహించే కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చెవ్వుని సీతారాములు పిలుపునిచ్చారు. హాలియాలో సంఘం వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కల్లుగీత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాలిగౌరారం, నార్కట్‌పల్లి: ప్రొఫెసర్ సాయిబాబ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని ప్రముఖ న్యాయవాది వేముల అందీప్, నాయకులు వేముల గోపీనాథ్, నార్కట్‌పల్లి సీపీఎం మండల కార్యదర్శి చెర్కు పెద్దులు అన్నారు. సాయిబాబది రాజ్యపు పరోక్ష హత్య అని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం నిలబడినందుకు, వామపక్ష మేధావిగా ఉన్నందుకే ఆయన్ను అక్రమ కేసుల్లో ఇరికించి నిర్బంధించినట్లు తెలిపారు.

చిట్యాల: తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూడి వీరేందర్‌గౌడ్ కోరారు. చిట్యాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న బీజేపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని, ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని స్వీకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, పట్టణ అధ్యక్షుడు కూరెల్ల శ్రీను, గంజి గోవర్ధన్, నూకేష్, ఉదయ్ పాల్గొన్నారు.

● **చిట్యాల:** మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. చిట్యాలలో అనారోగ్యంతో మృతి చెందిన చిత్రగంటి ప్రభాకర్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. మంత్రి ఇచ్చిన లక్ష రూపాయలను మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

పెద్దవూర: మండలంలోని చింతపల్లితండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ మాతృమూర్తి జంకా ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ రామచందర్‌నాయక్‌లతో కలిసి జంకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవినాయక్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

దేవరకొండ: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరకొండ మండలం మైనంపల్లి బండమీదితండాకు చెందిన సబావత్ లచ్చిరాం,లక్ష్మీ దంపతుల కుమార్తె అఖిల ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ నర్సింహ, నాయకులు సిరాజ్‌ఖాన్, కొర్ర రాంసింగ్ పాల్గొన్నారు.

చింతపల్లి: పత్తి కొనుగోలు విషయంలో తూకంలో మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు.

బెల్ట్‌షాపుల నిర్మూలనే లక్ష్యం

చండూరురూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బెల్ట్‌షాపుల నిర్మూలనతో పాటు అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం అన్నారు. మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో బెల్ట్‌షాపులు లేకుండా చేయాలని దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని అన్నారు. అంతేకాక ఇంటిగ్రేటెడ్ స్కూల్, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రూ.65 కోట్లు, లింకురోడ్ల మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పల్లె వెంకన్న, ఇరిగి రాజు, మాజీ సర్పంచులు భూతరాజు ఆంజనేయులు, రాములు, సైదులు, నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు చెన్నయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

హాలియా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ అంజనేయులు అన్నారు. దసరా పండుగ సందర్భంగా పేరూరు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, అందరూ బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పసుల శోభన్‌బాబు, రాయనబోయిన రాంబాబు, గోపనబోయిన రామలింగయ్య, పసుల పురుషోత్తం, బుడిత పర్వతాలు, బైర శ్రీకాంత్, నాగరాజు, శంకర్, గంటేకంపు రాజు, మగ్బూల్, నాగ సైదులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

17న సీఎం కప్ టార్చ్ ర్యాలీ

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సీహెచ్.విష్ణుమూర్తిగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 17వ తేదీన సాయంత్రం 4 గంటలకు మర్రిగూడ బైపాస్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ క్లాక్‌టవర్ సెంటర్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో క్రీడాకారులు, క్రీడా సంఘాలు, ఒలంపిక్ అసోసియేషన్, పీఈటీలు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మిర్యాలగూడ పట్టణంలో రాజీవ్‌చౌక్ వద్ద జన్మదిన వేడుకల సందర్భంగా నడిరోడ్డుపై గుమిగూడిన కార్యకర్తలు

ముప్పావుగంట డీజే మోత... బాణసంచా పేలుడు

నడిరోడ్డుపై కాంగ్రెస్ నేత పుట్టిన రోజు వేడుక, నిలిచిపోయిన వాహనాలు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుడు ప్రధాన రహదారిపై పుట్టినరోజు వేడుకలు నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. దీంతో పాదచారులు, వాహనదారులు అసౌకర్యం, అసహనానికి గురయ్యారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు రాజీవ్‌చౌక్ వద్ద ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ, 45 నిమిషాల పాటు డీజే మోతతో హల్‌చల్ చేశారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి లోనైన కాలనీవాసులు, వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని డీజేను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వేడుకలకు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నా కార్యకర్తలకు సూచనలు చేయకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పట్టణ పోలీసులు శ్రమించారు. అనంతరం డీజే వాహనాన్ని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

రైతుల్లో గుబులు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్న మిల్లర్లు భారీగా ధాన్యం కొనుగోలుకు సిద్ధమైనా, వారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం తేమ ఉంటే కనీస మద్దతు ధర క్వింటాకు గ్రేడ్-1 రకానికి రూ.2,320 ఇవ్వాల్సి ఉండగా, మిల్లర్లు రూ.2,400 ధర ఇస్తున్నారు. అయితే ఆధునిక టెక్నాలజీ ఉన్న మిల్లుల్లో తేమతో సంబంధం లేకపోగా, పచ్చి ధాన్యం అయితే నూకలు రాకుండా బియ్యం శాతం అధికంగా వస్తుందని, బియ్యం విరగకుండా అవసరమైనంతమేర గట్టిపడేలా స్టీమ్ చేయడం (ఆవిరిపట్టడం) ద్వారా బియ్యం శాతం అధికంగా పొందుతున్న మిల్లర్లు ధర విషయంలో మాత్రం తేమశాతాన్ని చూపుతూ తగ్గిస్తున్నారని, ఓ వైపు ఎగుమతుల అవకాశం, మరోవైపున ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నా గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్వింటాకు రూ.2,800 వరకు చెల్లిస్తేనే న్యాయం జరుగుతుందని, అయితే మిల్లర్లు ఉద్దేశపూర్వకంగానే ఆ ధర చెల్లించడం లేదని, రైతుల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమే వారి వ్యూహమనే చర్చ సాగుతోంది.

గోదాముల్లో స్థలం కరువు

ధాన్యం ఎంతైనా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, సీఎంఆర్‌కు మిల్లర్లు ముందుకురాకపోతే గోదాముల్లో నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జిల్లాలో ఈసారి ధాన్యం ఉత్పత్తి గణనీయంగా ఉండడంతో పాటు, గోదాముల్లో ఇప్పటికే 80శాతానికిపైగా నిల్వలు పేరుకుపోయాయి. జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యం ఉండగా, వాటిలో ఇప్పటికే 4,55,219 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ఇంకా 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు మాత్రమే అవకాశం ఉంది. అయితే ఈ సీజన్‌లో జిల్లాలో ప్రభుత్వమే దాదాపు 6.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది. ఈ ధాన్యమంతా నిల్వ చేయాలంటే అందుబాటులో ఉన్న స్థలానికి తోడు ఇంకా 5.70లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను వెతకాలి. తప్పనిసరైతే ప్రైవేట్ బిల్డింగులు, షెడ్లను అందుబాటులోకి తీసుకుంటారని తెలుస్తోంది. అయితే అధికారవర్గాల్లో మాత్రం సీఎంఆర్‌పై ప్రభుత్వం ఈ వారంలోగా నిర్ణయం తీసుకోవడం ద్వారా సమస్య పరిష్కారమై, మిల్లర్లు సీఎంఆర్‌కి అంగీకరిస్తారనే విశ్వాసం కనిపిస్తోంది.

వెల్లువలా ధాన్యం ఉత్పత్తి

ఈ సీజన్‌లో మొత్తం 7.50లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనావేయగా, అందులో దొడ్డురకం ధాన్యం 4.70లక్షల మెట్రిక్‌టన్నులు, సన్నధాన్యం 2,80,000 మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా. దొడ్డుధాన్యం మొత్తం 4.70లక్షల మెట్రిక్‌టన్నులు, సన్నధాన్యం 1.80లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. సన్నధాన్యం కొనుగోలుకు 81 కేంద్రాలు, దొడ్డురకాల కొనుగోలుకు 244 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 44 కేంద్రాలు ప్రారంభం కాగా, మిగిలినవి వరికోతలకు అనుగుణంగా ప్రారంభిస్తారు.

కమిటీలను ఏర్పాటు చేయాలని సూచనలు

జిల్లాలో ఏటా ధాన్యం కొనుగోళ్ల సమయంలో మిల్లర్లు సిండికేటై ధర తగ్గించడం, రైతులు ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. ధరల్లో వ్యత్యాసం లేకుండా స్థిరంగా మద్దతు ధర అందేలా ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, మార్కెటింగ్ శాఖల అధికారులతో ఏర్పాటయ్యే ఈ కమిటీలు కొనుగోళ్లను పర్యవేక్షించడంతో పాటు, రైతులకు అన్యాయం జరగకుండా, స్థిరమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 2021లోనూ జిల్లాలో రైతుల ఆందోళన నేపథ్యంలో అప్పటి కలెక్టర్, ఎస్పీ చొరవతో ఈ కమిటీలు ఏర్పాటు చేసి మిల్లులను నియంత్రించారు. దీంతో రైతులకు మద్దతు ధరకు మించి రూ.200 అదనపు ధర లభించింది. ఈ సారి కూడా మార్కెట్ అనుకూలంగా ఉన్న నేపథ్యంలో ఈ కమిటీలను పునరుద్ధరించడం ద్వారా మేలు జరిగేలా చూడాలని అందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నల్లగొండ మిల్లులకే ధాన్యం రాకడ

ఉమ్మడి జిల్లాలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వరిసాగు ఎక్కువగా ఉంది. అయితే జిల్లాలోని మిర్యాలగూడ, పరిసర ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకే ధాన్యం తాకిడి ఎక్కువ. ఇక్కడ ఆధునిక సాంకేతికత, అధిక మిల్లింగ్ సామర్థ్యం ఉండడంతో ఇక్కడే రద్దీ ఉంటోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడికి ధాన్యం వస్తుండడంతో రద్దీ ఏర్పడుతుంది. జిల్లాలో ఒకరోజు మిల్లింగ్ సామర్థ్యం 1500 మెట్రిక్ టన్నులు కాగా, సూర్యాపేట జిల్లాలో మిల్లుల సామర్థ్యం 400 మెట్రిక్ టన్నులకు మించడం లేదు. దీంతో అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని మిల్లులకే ధాన్యం వస్తోంది.